క్లుప్తంగా

ఆడపిల్లలపై వివక్ష తగదు



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎస్ఐ సాయికృష్ణ

గంట్యాడ: ఆడపిల్లలపై వివక్ష తగదని ఎస్ఐ డి.సాయికృష్ణ అన్నారు. కొఠారుబిల్లి కూడలిలో ఉన్న కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో పోలీస్‌శాఖ ఆధ్వర్యం లో లింగసమానత్వం,స్వీయ రక్షణ, పని ప్రదేశాల్లో వేధింపులు వంటి అంశాలపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలను మగపిల్లలను ఇద్దరిని సమానంగా చూడాలన్నారు. మహిళలు నేడు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కేజీబీవీ ఎస్ఓ అల్లు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ, భవిత కేంద్రాల సందర్శన



భవిత కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీసీ రామారావు

గంట్యాడ: స్థానిక మండల వనరుల కేంద్రం (ఎమ్మార్సీ),కొర్లాంలో గ్రామంలోని భవిత కేంద్రాన్ని సర్వశిక్ష అభియాన్ ఏపీసీ ఏ. రామారావు మంగళవారం సందర్శించారు. ఎమ్మార్సీలో సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ ద్వారా అమలయ్యే కార్యక్రమాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి, అక్కడ ప్రత్యేక అవసరాల పిల్లలకు అందుతున్న సేవలు, ఐఈఆర్టీలు బోధిస్తున్న తీరును పరిశీలించారు. ఎంఈఓ విజయకుమారి, ఎంఈఓ-2 సీహెచ్.వెంకటరావు, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం



రోడ్డుకు అడ్డంగా కూలిన చింత చెట్టు

గజపతినగరం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ దిగువ వీధిలో గ్రామదేవత పైడితల్లమ్మ గుడి సమీపంలో రోడ్డుపై భారీ చింతచెట్టు మంగళవారం కూలిపోయింది. ఈ మార్గంలో ఎన్.జి.ఆర్. పురం, లింగాలవలస, జిన్నాం, తుమికాపల్లి, లోగిశ, ముచ్చర్ల తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోక లు సాగిస్తుంటారు. అయితే చెట్టు కూలిన సమయంలో వాహనాలు, పాదచారులు ఎవరూ ఆ ప్రదేశంలో లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. చెట్టు కూలిన సమయంలో కొమ్మలు విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు కాసేపు అంతరాయం కలిగింది. స్థానికులు, అధికారులు స్పందించి చెట్టు కొమ్మల తొలగింపు పనులు చేశారు.

సచివాలయంలో తనిఖీలు



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం సిబ్బందితో సమీక్షించారు. సమయపాలన పాటిస్తూ ప్రభుత్వం సూచించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని, సర్వేల నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. హౌస్‌హోల్డ్ సర్వేను వేగవంతం చేయాలన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న సర్పంచ్ శ్రీరామ్మూర్తి, తదితరులు

గంట్యాడ: మండలంలోని పెదమధుపాడ గ్రామంలో శివాలయం వార్షికోత్సవాన్ని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, పెద్దలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు. సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి, స్థానిక పెద్దలు గనివాడ సన్యాసినాయుడు, టి. అప్పారావు, దారపురెడ్డి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకమహాలక్ష్మి జాతర

- మూడోరోజు అమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- అనుబంధ అమ్మవార్ల ఆలయాల్లో పూజలు
- అలరించిన ఆర్కెస్ట్రా, నృత్య రూపకాలు, కోలాటం, తప్పిట గుల్లు ప్రదర్శనలు



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

చీపురుపల్లి: భక్తుల కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మూడో రోజు మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సాంప్రదాయం ప్రకారం కనకమహాలక్ష్మి అమ్మవారి అక్కచెల్లెళ్లుగా చెప్పుకునే పట్టణంలో ఉన్న కోటదుర్గమ్మ, సంతానలక్ష్మి, ఆసిరితల్లి, భాగిరేతమ్మ అమ్మవార్లను జాతరలో ఆఖరిరోజు మంగళ వారం దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.అందులో భాగంగానే అనుబంధ అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం భక్తులు కనకమహాలక్ష్మి ఆలయానికి తరలివచ్చారు.అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద , ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద మహిళలు పూజలు చేశారు. దేవదాయశాఖ నేతృత్వంలో దేవస్థానం మండపంలో కోలాటం, తప్పిటగుల్లు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు....

జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దేవస్థానం సమీపంలోని సాంస్కృతిక వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు,ప్రేక్షకులు తరలివచ్చారు. ప్రముఖ సినీ గాయని సాహితీ ఛాగంటితో పాటు జీ తెలుగు సరిగమలు సీజన్-13 టాప్-3 గాయకుడు పవన్ కల్యాన్ ఆలపించిన గేయాలు అలరించాయి. అలాగే మణిపూర్ స్పెషల్ ఈవెంట్ తో పాటు నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి.



సంతానలక్ష్మి ఆలయం వద్ద తులసి కోటకు పూజలు చేస్తున్న భక్తులు



కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో వేప చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



పూజలందుకుంటున్న కోటదుర్గమ్మ అమ్మవారు



పూజలందుకుంటున్న సంతానలక్ష్మి అమ్మవారు



అలరించిన నృత్య రూపకాలు



అమ్మవారి దేవస్థానం మండపంలో కోలాటం ప్రదర్శన



అమ్మవారి దేవస్థానం మండపంలో తప్పిట గుల్లు ప్రదర్శన



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న లాట్ మొబైల్స్ సిబ్బంది

కూటమి ప్రభుత్వానికి గుణపాఠం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి టీచర్లు తగిన బుద్ధి చెప్పారు
- త్వరలో ప్రజలు కూడా బుద్ధి చెప్పడం ఖాయం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తూ, ప్రజలతో పాటు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అటకెక్కిస్తున్న కూటమి ప్రభుత్వానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు తగిన బుద్ధి చెప్పారని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాల యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్నికల్లో విజయం సాధించిన గాదె శ్రీనివాసులనాయుడుకు ఆయన శుభా కాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి చెంప చెల్లుమనిపించేలా ఉపాధ్యాయులు తీర్పు ఇచ్చారని అన్నారు.బూటకపు హామీలు, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కూటమికి రానున్న రోజుల్లో ప్రజలు రెండు చెంపలూ వాయించడం ఖాయమన్నారు. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పీఆర్సీ, ఐఆర్‌తో పాటు ఇతర హామీలను ఎగ్గొట్టారన్నారు.మరో వైపు సూపర్ సిక్స్ పథకాలకు ఎగనామం పెడుతున్నారని, బడ్జెట్‌లో నిరుద్యోగిభృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం పథకాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం, దీపం పథకం, తల్లికివందనం పథకాలకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించక పోవడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ కోసం పెట్టిన మొదటి సంతకం ఏమైందని నిలదీశారు. మంత్రి అచ్చెన్నాయుడు రెండు నాలుకల ధోరణితో మాట్లాడుతున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన గాదె శ్రీనివాసుల నాయుడు తమ వాడేనని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఓటమిని ఒప్పుకోకుండా అచ్చెన్నాయుడు ఏదేదో మాట్లాడడం సరికాదని, ఇది మీకు గుణపాటమని అన్నారు. జెడ్పీటీసీ గార తవుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, సీనియర్ నాయకులు మండల సురేష్,బెల్లాన త్రినాథరావు, కె.పైడిపునాయుడు, పి.నారాయణ మూర్తి, శీర రమణ, సన్యాసిరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన గాదె శ్రీనివాసులునాయుడికి వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన శ్రీనివాసులునాయుడును చీపురుపల్లి, గరివిడి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు . చీపురుపల్లి, గరివిడి మండలాల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, గవిడి సురేష్, యల్లంటి పోలీస్, కర్రోతు ప్రసాద్, గవిడి వాసు, ఉపాధ్యాయ సంఘ నాయకులు వలిరెడ్డి రవీంద్రనాయుడు, గంగుపల్లి సత్యనారాయణ, కర్రోతు విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

14న మండల సర్వసభ్య సమావేశం

బొండపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 14వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.గిరి బాల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు,సర్పంచ్‌లు, అన్ని శాఖ ల అధికారులు హాజరు కావాలని కోరారు.

ముత్యాలమ్మ గుడి ప్రతిష్ట



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

మెరకముడిదాం: రాచగుమడాం గ్రామంలో ముత్యాలమ్మ గుడి ప్రతిష్ట మంగళవారం ఘనంగా నిర్వ హించారు.ఆగ్రామానికి చెందిన అల్లూరి ఇంటిపేరుతో ఉన్న రాజకుటుంబీకులు ఈ గుడిని నిర్మించారు. ప్రతిష్టోత్సవాల సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. రాచగుమడాం గ్రామంతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం 2వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు పనులు పూర్తి చేయించండి

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ ఎస్.కోట పరిధిలోని గిరిశిఖర రేగపుణ్యగిరి గ్రామానికి చేపడుతున్న రోడ్డు నిర్మాణ పను లను అడ్డగిస్తున్న వారిపై చర్యలు తీసుకుని, పనులను వేగవంతం చేయించాలని రేగపుణ్యగిరి గిరిజనులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ అంబేద్కర్ ఇచ్చిన హామీ మేరకు ఉపాధి హామీ నిధులు రూ.4 కోట్లతో 3.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారన్నారు. అయితే కొండ కింద గ్రామాల్లో కొంతమంది రోడ్డు పనులను అడ్డుకున్నారని, ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను సత్వరం పరిష్కరించాలని, అటవీశాఖ అనుమతుల కోసం రెవెన్యూ అధికారులు ప్రయత్నం చేయాలని, మార్చి నెలాఖరకురోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని కోరుతూ ఇన్‌చార్జ్ తహసీల్దార్ భరత్‌కు వినతిపత్రం అందజేశారు.



తహసీల్దార్ భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

తాగునీటి సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

దత్తిరాజేరు: వేసవి నేపథ్యంలో మండలంలో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 35 గ్రామ పంచాయతీల్లో ఎక్కడ తాగునీటి సమస్య ఉన్నా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 97041 30245కు సమాచారం అందించాలని సూచించారు. బోర్లు పాడైనా, తాగునీటి వనరుల్లో నీరు కలుషితం అయినా సమాచారం అందిస్తే వెంటనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

ఉపాధి హామీ నిధులు పక్కదారి

శృంగవరపుకోట: ఉపాధి హామీ పథకానికి కేంద్రం కేటాయిస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని, ఉపాధి చట్టాల అమలుపై ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని వ్యవసా య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు అన్నారు. గౌరీపురం గ్రామంలోని చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు ఉపాధి హామీ చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి చట్టంలో మెటీరియల్ వర్క్‌లకు 10శాతం మాత్రమే ఖర్చు చేయాల్సి ఉందన్నారు. కానీ ప్రభుత్వం ఉపాధి నిధులను దారి మళ్లించి రోడ్లు, భవనాలు కడుతోందని, దీంతో వేతనదారులకు పనిదినాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని వివరించారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంట్రాక్టర్లను పోషించేందుకు ఈ పనులను ప్రోత్సహిస్తున్నారన్నారు. వేతనదారులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, 200 పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, మేట్లకు రూ.7,500లు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈనెల 12న విజయవాడలో జరిగే ఉద్యమానికి వేతనదారులు అంతా తరలి రావాలని పిలుపునిచ్చారు.



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న అప్పారావు

సీఎంకు లేఖ

శృంగవరపుకోట: భీమసింగిలోని విజయరామ గజపతి సహకార చక్కెర కర్మాగారం ఉద్యోగులు, కార్మికులు తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంగళవారం లేఖ రాశారు. కర్మాగారాన్ని నిలిపివేయడంతో 280మంది ఉద్యోగులకు యాజమాన్యం వేతన బకాయిలు చెల్లించలేదని లేఖలో పేర్కొన్నారు. వేతన బకాయిలతో పాటు భవిష్యనిధి, గ్రాట్యూటీ చెల్లించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఉత్తరంలో కోరారు.

సమ్మెటివ్-4 పరీక్షల నిర్వహణ పరిశీలన

వేపాడ: స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమ్మెటివ్-4 తెలుగు పరీక్ష నిర్వహణను ఎంఈఓ బాలభాస్కరరావు పరిశీలించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు



● ఆటో డ్రైవర్ల నిరసన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో డ్రైవర్లను ఉపాధిపై వేటు వేసే చీకటి చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఏపీ ఆటోడ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) నేతృత్వం లో ఎస్.కోటలోని దేవీ జంక్షన్‌లో మంగళవారం నిరసన తెలిపారు. జీఎస్ఆర్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్, నూతన మోటార్ యాక్ట్ 106(1)(2)ను రద్దు చేయాలని, ఓలా, ఊబర్, రాపిడ్‌వంటి యాప్‌లను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రమాద బీమా రూ.10లక్షలు చేయాలని, డీజిల్, పెట్రోల్, ఎల్‌పీజీ గ్యాస్ ధరలు తగ్గించాలని, డిమాండ్ చేశారు. ఫెడరేషన్ నాయకులు జి.వామనమూర్తి, కండిపల్లి భీముడు, తదితరులు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

● లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని గంట్యాడ ఐసీడీఎస్ పీఓ డి.ఉమాభారతి అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో పెదమజ్జిపాలెంలో స్థానిక పీహెచ్‌సీ, ఐసీడీఎస్ సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీఓ ఉమాభారతి మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షల వల్ల భ్రూణ హత్యలు జరిగే అవకాశం ఉందన్నారు. లింగనిర్ధారణ పరీక్ష చేసిన వారు, చేయించిన వారు, ప్రోత్సహించిన వారు శిక్షార్హులని తెలిపారు. బాల్య వివాహాల నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యులు పల్లవి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

– గంట్యాడ

● పరీక్ష సామగ్రి వితరణ



చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విశాఖపట్నానికి చెందిన నరహరిశెట్టి లలితకుమారి, దివ్య, రమేష్ రూ.23,850 విలువైన పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. మంగళవారం ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 196 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. దాతలకు హెచ్‌ఎం చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. వీరు గతేడాది కూడా విద్యార్థులకు పరీక్ష సామగ్రి సమకూర్చారని హెచ్‌ఎం చెప్పారు.ఎన్‌సీసీ ఆఫీసర్ మామిడి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– చీపురుపల్లి

తాగునీటి సమస్య తలెత్తకూడదు

మెరకముడిదాం: వేసవి నేపథ్యంలో మండలంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీడీఓ జి.భాస్కరరావు ఒక ప్రకటనలో మంగళవా రం ఆదేశించారు. గ్రామాల్లో బోర్లు పాడైతే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్లను ప్రాజెక్టు సిబ్బంది పరిశీలించి సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

దత్తిరాజేరు: పంటల సాగులో అధిక దిగుబడులను సాధించాలంటే సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలని ఏఓ అనూరాధ అన్నారు. భూపాల రాజపురం గ్రామంలో మంగళ వారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను సర్పంచ్ గురునాయుడుతో కలిసి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. భూఆధార్ కోసం రైతులు రైతు సేవాకేంద్రంలో వివరాలు నమోదు చేయించుకోవాలని చెప్పారు.